ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



చిత్తూరు జిల్లా వార్తలు

గురువారం 2 మే 2024

ప్రత్యర్థులకు నో ఎంట్రీ

పెద్దిరెడ్డి సామ్రాజ్యంగా సదుం





సదుం పోలీస్‌స్టేషన్ ముందే బీసీవై పార్టీ ప్రచార రథాన్ని దగ్ధం చేసిన వైసీపీ మూకలు(ఫైల్ ఫొటో)

ఎదురు తిరిగినా, ప్రశ్నించినా దాడులే - జీ హుజూర్ అంటున్న పోలీసులు

పుంగనూరు, మే 1: రాజులు, రాచరికాలు పోయినా పుంగనూరు నియోజకవర్గంలో మాత్రం ఇంకా ఆ ఛాయలు కనిపిస్తూనే ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆ ప్రాంతాన్ని తన సామ్రాజ్యంగా మార్చేసుకున్నారు. ముఖ్యంగా సొంత మండలం సదుంలో ఆయన అనుమతి ఉంటే తప్పా ప్రత్యర్థులకు ప్రవేశం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎవరైనా ఎదురుతిరిగినా, ప్రశ్నించినా దాడులతో సమాధానం చెబుతున్నారు. రెండు రోజుల క్రితం భారతీయ చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు, పుంగనూరు అభ్యర్థి రామచంద్రయాదవ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దిరెడ్డి స్వగ్రామం ఎర్రాతివారిపల్లెకు వెళ్లడంతో వైసీపీ మూకలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడులు చేశారు. 15 వాహనాలను ధ్వంసం చేసి, 20 మందిని గాయపరిచారు. భద్రత కోసం ఆయన సదుం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా వందలాది మంది లోనికి చొరబడి హతమార్చడానికి ప్రయత్నించారు. స్టేషన్ ముందు నిలిపి ఉంచిన ప్రచార రథాన్ని పోలీసులు చూస్తుండగానే ధ్వంసం చేసి, నిప్పుపెట్టి బీభత్సం సృష్టించారు. కానీ బాధితుడైన రామచంద్రయాదవ్‌పైనే పోలీసులు హత్యాయత్నం కేసు పెట్టారు. తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు పెట్టి ఎన్నికలయ్యే వరకు జైలుకు పంపింది. ప్రచారానికి బ్రేక్ చేయడం కోసమే వైసీపీ ఈ మేరకు కుయుక్తులు పన్నిందన్న విమర్శలున్నాయి.



ఎర్రాతివారిపల్లెలో బీసీవై పార్టీ అభ్యర్థి రామచంద్రయాదవ్ ప్రచార రథంపై కర్రలు, రాళ్లు రువ్వుతున్న వైసీపీ కార్యకర్తలు (ఫైల్ ఫొటో)

జీవీ శ్రీనాథరెడ్డిపై పలుమార్లు దౌర్జన్యాలు

పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ.శ్రీనాథరెడ్డి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రతి సందర్భంలోనూ సదుం మండలం బూరగమంద, నడిగడ్డ, సదుం జడ్పీ హైస్కూల్ వద్ద పెద్దిరెడ్డి అనుచరులు దౌర్జన్యాలు, దాడులకు పాల్పడ్డారు. సదుం వార్డు మెంబరుగా ఎన్నికైన టీడీపీ నేత రఘునాథరెడ్డిపై పెద్దిరెడ్డి వర్గీయులు దాడి చేయడంతో ఆయనను పరామర్శించడానికి వెళ్లిన శ్రీనాథరెడ్డిపై సదుం వినాయక స్కూల్ వద్ద ద్వారకనాథరెడ్డి, పెద్దిరెడ్డి అనుచరులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ విషయంపై ఆయన టీడీపీ జిల్లా నేతలతో కలిసి చిత్తూరులో ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుకూ తప్పని అవమానం

1990లో సదుంలో ఓ మహిళను హత్య చేసి, పోలీస్ క్వార్టర్స్ నుంచి బయటకు తీసుకెళ్లి మూటగట్టి పడేశారన్న సమాచారంతో ప్రజలు పెద్దయెత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆ సమయంలో జరిపిన పోలీసు కాల్పుల్లో జాంద్రపేట, చింతలవారిపల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మృతి చెందారు. సదుంలో మృతుల కుటుంబీకులను పరామర్శించడానికి కర్షక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో నారా చంద్రబాబు నాయుడు రాగా పెద్దిరెడ్డి అనుచరులు మిద్దెలపై నుంచి పేడ నీళ్లను చంద్రబాబు ఉన్న ప్రాంతాల్లో చల్లారు. సదుంలో ఎక్కడా చంద్రబాబు కూర్చోరాదని హుకుం జారీ చేసి, అవమానం చేయడంతో ఆయన టీడీపీ శ్రేణులతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

చిరంజీవి అభిమాని ఎలక్ట్రికల్ షాపు దగ్ధం

ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు చిరంజీవి పట్ల ఉన్న అభిమానంతో సదుంకు చెందిన ప్రసాద్ పార్టీలో ఉత్సాహంగా పనిచేసేవారు. దీన్ని జీర్ణించుకోలేని పెద్దిరెడ్డి అనుచరులు 'చిరంజీవి పార్టీలో ఉంటావా' అంటూ ప్రసాద్‌కు చెందిన ఎలక్ట్రికల్ షాపుపై పెట్రోల్ పోసి, నిప్పుపెట్టారు. ఆయనపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారు.

రామచంద్రయాదవ్‌పై దాడి

బీసీవైపీ అభ్యర్థి బోడే రామచంద్ర యాదవ్ మంత్రి స్వగ్రామం ఎర్రాతివారిపల్లెకు ఎన్నికల ప్రచారానికి వెళ్లడంతో 'మా పెద్దాయన ఊరికే వస్తారా' అంటూ బీభత్సం సృష్టించారు. ప్రచార రథంపై రాళ్లు వేశారు. వాహనాలు, కార్యకర్తలపై కర్రలు, రాళ్లతో దాడులు చేశారు. కల్లూరు రోడ్డు, సదుం పోలీస్‌స్టేషన్ వద్ద ఆయనను హతమార్చాలని వైసీపీ అల్లరి మూకలు ప్రయత్నించాయి. అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మణికంఠ వచ్చి పరిశీలించారు. చివరకు పోలీసులు ఫిర్యాదుదారులుగా బాధితులైన బీసీవైపీ వారిపైనే హత్యాయత్నం కేసులు పెట్టారు.

బీజేపీ ఎంపీటీసీ అభ్యర్థి నామినేషన్ చించివేత

సదుం ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఆ పార్టీ నాయకుడు కలికిరి హరిబాబు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు. 'మాకు వ్యతిరేకంగా నామినేషన్ వేయడానికి నీకు ఎంత ధైర్యం' అంటూ 2020 మార్చి 9వ తేదీ నామినేషన్ పత్రాలు బలవంతంగా లాక్కెళ్లి చించేశారు. దుర్భాషలాడి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ విషయంపై అప్పటి చిత్తూరు ఎస్పీ సెంథిల్ కుమార్ సదుం వచ్చి విచారించారు.



రామచంద్రయాదవ్ ప్రచార వాహనానికి అడ్డంగా పడుకున్న వైసీపీ నేత(ఫైల్‌ఫొటో)

2014లో టీడీపీ అభ్యర్థి కుమారుడిపై దాడి

2014 ఎన్నికల్లో పుంగనూరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎం.వెంకట్రమణరాజు కుమారుడు ఎం.సుదీప్, మరికొందరు ప్రచారానికి సదుం వెళ్లారు. జీర్ణించుకోలేని పెద్దిరెడ్డి అనుచరులు పెట్రోల్ బంకు వద్ద సుదీప్, మరికొందరిపై దాడి చేయడంతో పొలాల నుంచి తప్పించుకుని వెళ్లారు. టీడీపీ శ్రేణులు సదుం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సదుంలో తెలుగుదేశం పార్టీలో ఉత్సాహంగా ఉన్నారని నడిగడ్డకు చెందిన పవన్‌కుమార్‌రెడ్డి (మాజీ సైనికుడు)ని పలుమార్లు బెదిరించి, కొట్టారు.

బీసీవై పార్టీ నేత ఆనందరెడ్డి ఇంటికి నిప్పు

సదుం మండలం చిలకపాటివారిపల్లెకు చెందిన బీసీవై పార్టీ నాయకుడు ఆనందరెడ్డి రామచంద్రయాదవ్‌కు భోజనం పెట్టారని ఆయన ఇంటికి వైసీపీ మూకలు నిప్పు పెట్టాయి. ఆనందరెడ్డి భార్య, పిల్లలు ఇంట్లో ఉండగా ఇంటికి తాళాలు వేసి పెట్రోల్ పోసి కాల్చివేశారు. యాక్టివా స్కూటర్‌ను పూర్తిగా దహనం చేశారు. కారును ధ్వంసం చేసి, ఇంటిపైకి రాళ్లు, కర్రలు రువ్వి బీభత్సం సృష్టించారు.



ముఖేశ్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న బీసీవై పార్టీ నేతలు

పెద్దిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలి

సదుం ఘటనలో నిందితులను అరెస్టు చేయాలి - ఈసీకి బీసీవైపీ విజ్ఞప్తి

పుంగనూరు, ఏప్రిల్ 1: సదుంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌పై దాడి చేసి విధ్వంసానికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని ఆ పార్టీ నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో ముఖేశ్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. బుధవారం విజయవాడ ఎన్నికల కమిషన్ కార్యాలయంలో బీసీవై పార్టీ మంగళగిరి ఇన్‌చార్జి శివరాం, రాష్ట్ర నాయకురాలు చాముండేశ్వరిదేవి తదితరులు సీఈవోను కలిసి పుంగనూరు నియోజకవర్గం సదుంలో వైసీపీ అల్లరి మూకలు చేసిన దాడి, బీభత్సం గురించి వివరించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, ప్రధానంగా పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న వైప్లస్ భద్రత గల రామచంద్రయాదవ్‌కు పోలీసు భద్రత కల్పించకుండా వైసీపీకి అనుకూలంగా పనిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడైన రామచంద్రయాదవ్‌పైనే హత్యాయత్నం కేసు పెట్టి, ఎన్నికలకు దూరం చేయాలని పోలీసులు కుట్ర చేశారని, పోలీస్‌స్టేషన్‌పై వైసీపీ వారు దాడి చేసి స్టేషన్ ముందే ప్రచారరథం కాల్చివేశారని వివరించారు. న్యాయం కోసం అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళతామని నాయకులు తెలిపారు.

సదుం ఘటనలో 9 మందికి రిమాండ్

తిరుపతి(నేరవిభాగం), మే 1: సదుం మండలం ఎర్రాతివారి పల్లెలో సోమవారం జరిగిన ఘర్షణలో మండల పరిధిలోని వేదాయపాలెం, గుట్టపల్లి, యాదమరి, దాసర్లపల్లి, రాజుపల్లి ప్రాంతాలకు చెందిన అనిల్‌కుమార్ రెడ్డి, వెంకటేష్, ఓం ప్రకాష్, వేణుగోపాల్ రెడ్డి, విశ్వనాథం, కృష్ణదుర్గ, వెంకటాచలపతి, సుబ్రహ్మణ్యం, నవీన్‌కుమార్‌లపై ఐపీసీ 307, 147,148,341,323 సెక్షన్ల కింద చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ మారుతీలు వీరిని తిరుపతిలోని ఒకటో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి సత్య క్రాంతకుమార్ ఎదుట బుధవారం రాత్రి హాజరు పరిచారు. వీరికి ఈనెల 14వ తేదీవరకు రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పినట్లు సీఐ కృష్ణారెడ్డి చెప్పారు. వారిని చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు.



బోసిపోయిన దర్గాసర్కిల్

నిప్పుల కుంపటి

తొలిసారిగా ఒక మండలం రెడ్‌జోన్, 11 మండలాలు ఆరెంజ్ జోన్

42 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతల నమోదు

చిత్తూరు కలెక్టరేట్, మే1: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల తీవ్రతకు తోడు వడగాలులు వీస్తుండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తొలిసారిగా జిల్లాలో గంగవరం మండలం రెడ్‌జోన్‌లోకి వెళ్లింది. అలాగే బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల, గుడుపల్లి, కార్వేటినగరం, కుప్పం, పలమనేరు, పాలసముద్రం, పులిచెర్ల, పుంగనూరు, శ్రీరంగరాజపురం మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. శ్రీరంగరాజపురంలో 45.6, గంగవరం 44.8, బంగారుపాళ్యం, పాలసముద్రం 44.3, చిత్తూరు 44.1, గుడిపాల, కార్వేటినగరం 44, పులిచెర్ల 43.9, యాదమరి 43.7, వెదురుకుప్పం 43.5, తవణంపల్లె 43.4, పుంగనూరు, గుడుపల్లె 43.3, గంగాధరనెల్లూరు 43.1, పూతలపట్టు 42.9, చౌడేపల్లి, నగరి, రొంపిచెర్ల 42.6, పలమనేరు, కుప్పం, పెనుమూరు 42.2, సోమల 42.1, సదుం 41.7, వి.కోట 41.5, పెద్దపంజాణి, శాంతిపురంలో 41.4, ఐరాల 41.4, నిండ్ర, విజయపురం 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

న్యాయం కోసం వెళితే చితకబాదారు

- భర్త దాడిలో గాయపడిన భార్య, అత్త



న్యాయం కోసం వెళ్లిన అత్తను కొడుతున్న అల్లుడు - కోడలు స్వప్న జుట్టు పట్టుకుని చితకబాదుతున్న అత్తామామ

మదనపల్లె టౌన్, మే 1: భార్యాభర్తల వివాహబంధం విషయమై కోర్టులో కేసు జరుగుతుండగా, భర్త రెండో వివాహం చేసుకున్నాడని అతడి ఇంటి ముందు నిరసన తెలుపుతున్న భార్య, అత్తపై ఆమె భర్త, మామ కలసి దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. పుంగనూరుకు చెందిన శకుంతలమ్మ కుమార్తె టి.స్వప్న (28)ను ఏడేళ్ల క్రితం వాల్మీకిపురం మండలం భూమకవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు ఎం.నరసింహాలు(34)కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి బాలకృష్ణ అనే కుమారుడు ఉన్నాడు. రెండేళ్ల క్రితం వీరిద్దరి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి మదనపల్లె కోర్టులో కేసులు వేసుకున్నారు. తీర్పు రాక ముందే నరసింహాలు రెండో వివాహం చేసుకుని ఇంకో కొడుకును కన్నాడని స్వప్న తెలుసుకుంది. ఈ విషయమై పలుమార్లు భర్త ఇంటికి వెళ్లి నిలదీసింది. ఈ క్రమంలో బుధవారం స్వప్న, ఆమె తల్లి శకుంతలమ్మ దేవతానగర్‌లోని నరసింహాలు ఇంటి వద్దకు వెళ్లి నిరసనకు దిగారు. దీంతో రెడ్డెప్ప, ఆయన కుమారుడు నరసింహాలు అక్కడికి చేరుకుని వారిద్దరినీ చితకబాదారు. స్థానికులు ఈ ఘటనను వీడియో తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలూకా పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. గాయపడి మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శకుంతలమ్మను విచారించి, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చంద్రగిరిలో నేడు హలో లోకేశ్

చంద్రగిరి, మే 1: చంద్రగిరి మండలం అగరాల సమీపంలోని జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ప్రైవేటు స్థలంలో గురువారం హలో లోకేశ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విచ్చేయనున్నారు. ఈసందర్భంగా చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. సభా స్థలాన్ని బుధవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమానికి సుమారు పది వేల మంది యువత హాజరుకానున్నట్లు తెలిపారు. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా విద్యావ్యవస్థను తీర్చిదిద్దంపై, ఉద్యోగాల కల్పనకు కృషిపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. యువతీయువకులు భారీ స్థాయిలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని నానీ పిలుపునిచ్చారు.




అగరాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని - చదును చేస్తున్న సభా స్థలం

ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), మే 1: పుట్టుకతో అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఎనిమిదేళ్ల చిన్నారికి శస్త్ర చికిత్స చేసి, ప్రాణాలను నిలబెట్టామని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. రుయా చిన్నపిల్లల విభాగంలో బుధవారం మీడియాకు వివరాలు తెలిపారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలం దళవాయిపల్లెకి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి హిమశ్రీకి పుట్టినప్పటి నుంచి కాళ్లకు, పొట్ట కింద భాగానికి రక్త సరఫరా వ్యతిరేక దిశలో జరుగుతుంది. దీంతో బాలిక పొట్ట నుంచి కాళ్ల వరకు శరీరం అంతా పచ్చని రంగులోకి మారి ప్రమాదకరంగా తయారైంది. ఈ సమస్యతో చిన్నారి సరిగ్గా నడిచే పరిస్థితి కూడా లేకపోయింది. పలు ఆస్పత్రుల్లో చూపించినా, దీనికి చికిత్స లేదని చెప్పడంతో వారం కిందట రుయా చిన్నపిల్లల విభాగానికి బాలికను ఆమె తల్లి సుశీల తీసుకొచ్చింది. కార్డియో థొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రమ పరీక్షించి బాలిక లార్జ్ ఆర్టీరియో వీనస్ మాల్ ఫార్మేషన్ ఆఫ్ బై లెటర్ లోయర్ లింబ్స్, అబ్డామిన్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, డాక్టర్ రాధా సాయంతో అధునాతన పద్ధతిలో చిన్నారికి నాన్ ఇన్వేషు రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ అనే టెక్నిక్‌తో కోత, కుట్లు లేకుండా శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం చిన్నారి పూర్తిగా కోలుకోవడంతోపాటు సాధారణంగా నడుస్తుందని రవిప్రభు తెలిపారు. ఇటీవల రుయాస్పత్రిలో చేస్తున్న అరుదైన శస్త్ర చికిత్సలకు సంబంధించిన వివరాలు పత్రికల్లో చూసి వీరు ఇక్కడకు వచ్చారన్నారు. ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, క్లినికల్ పర్యూజనిస్ట్ చిరంజీవి, నర్సింగ్ అధికారి రాధా తదితరులు పాల్గొన్నారు.




కోలుకున్న చిన్నారితో వైద్య బృందం

- స్టేషన్‌లోనే వివాహితపై దాడి
- హెడ్ కానిస్టేబుల్‌పై వీరంగం

రెచ్చిపోయిన రౌడీ పోలీస్!

- వలంటీర్ ఆత్మహత్య కేసులో జైలుకెళ్లిన నేపథ్యం
- పలుకుబడితో అదే స్టేషన్‌లో తిరిగి కానిస్టేబుల్‌గా నియామకం

శ్రీకాళహస్తి, మే 1: శ్రీకాళహస్తిలో ఓ పోలీసు రెచ్చిపోయాడు. అర్ధరాత్రి పోలీస్ స్టేషన్లో ఓ వివాహితపై దాడికి పాల్పడ్డాడు.అడ్డుకోబోయిన హెడ్ కానిస్టేబుల్‌పై వీరంగం చేశాడు. పోలీసుశాఖలో సంచలనం రేకెత్తించిన ఈ ఘటన పూర్వాపరాలివి.... శ్రీకాళహస్తి సన్నిధివీధి ప్రాంతానికి చెందిన ఓ యువకుడు పట్టణంలోని ఓ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పని చేసేవాడు.స్టేషన్ తరఫున ముక్కంటి ఆలయంలో ప్రోటోకాల్ దర్శనాలు చేయించేవాడు. పలుకుబడితో స్థానికంగా ఏళ్ల తరబడి పాతుకుపోయాడు.వివాహమై ఇద్దరు పిల్లలున్నప్పటికీ కొందరు యువతులతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ క్రమంలో ఒక వలంటీర్‌తో చనువు ఏర్పడింది.అలాగే ఓ వివాహితతో సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ తన తండ్రితో వెళ్లి పెళ్లి చేసుకోమంటూ ప్రాధేయపడింది. ఆ సమయంలో కానిస్టేబుల్, ఆయన కుటుంబ సభ్యులు కలిసి తండ్రి ఎదుటే తనను దారుణంగా అవమానించారంటూ రెండు పేజీల సూసైడ్ నోట్ రాసిపెట్టి ఉరేసుకుని చనిపోయింది. ఆ లేఖ ఆధారంగా ఆ కానిస్టేబుల్‌తో పాటు అతడితో సన్నిహితంగా వివాహితపై కేసు నమోదు చేశారు.ఇద్దరికీ రిమాండ్ విధించడంతో జైలుపాలయ్యారు. దీంతో కానిస్టేబుల్ కొంతకాలం సస్పెండయ్యారు.కొద్ది నెలల క్రితం అజ్ఞాతం నుంచి బయటపడ్డ అతడు మళ్లీ అదే స్టేషన్లో కానిస్టేబుల్‌గా చేరాడు.మద్యం మత్తులో మంగళవారం రాత్రి తనకు సన్నిహితురాలైన వివాహితకు ఫోన్ చేసి శ్రీరామ్ నగర్ కాలనీలోని ఆమె ఇంటివద్దకు వెళ్లాడు. ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె నేరుగా స్టేషన్‌కి వెళ్లి కానిస్టేబుల్ తీరును వివరించింది.అక్కడ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించాడు.ఆమెను వెంబడిస్తూ కారులో స్టేషన్‌కు చేరుకున్న కానిస్టేబుల్ అది గమనించి రెచ్చిపోయాడు. నా మీదే కంప్లైంట్ రాసివ్వమంటావా అంటూ హెడ్ కానిస్టేబుల్‌ను బూతులు తిట్టాడు. అక్కడే కుర్చీలో కూర్చుని ఉన్న వివాహితపై దాడికి తెగబడ్డాడు.దీంతో ఆమె విలపిస్తూ ఇంటిబాట పట్టింది.ఈ ఘటనపై సీఐకి లిఖితపూర్వకంగా హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేశారు.



శృతి మించిన లోకలిజం...!

శ్రీకాళహస్తి పోలీస్ శాఖలో లోకలిజం శృతి మించిపోతోంది. నిబంధనల ప్రకారం స్థానికంగా పోలీసులకు విధులు కేటాయించకూడదు.ఒకవేళ కేటాయించినా కాలపరిమితి ముగిసిన తర్వాత తప్పనిసరిగా బదిలీ చేయాలి.ఇందులో ఏ ఒక్క నిబంధన కూడా శ్రీకాళహస్తిలో చాలామందికి అమలు కావడం లేదు. ఇలా పాతుకుపోయిన వారిలో చాలామంది చట్ట వ్యతిరేక వ్యాపారాల్లో భాగస్వాములయ్యారన్న ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి.ఆర్థికంగా బలవంతులైపోయి ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయడం లేదు. కొన్ని సందర్భాల్లో అధికారులపై తిరగబడి దుర్భాషలాడిన ఘటనలు కూడా జరిగాయి. ఇంత జరుగుతున్నా ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిని ఎవరూ కదపడం లేదు. కాబట్టే స్టేషన్లోనే హెడ్ కానిస్టేబుల్‌పై కానిస్టేబుల్ రెచ్చిపోయే పరిస్థితి వచ్చింది. ఇకనైనా అధికారులు రక్షకభటుల ప్రక్షాళనపై దృష్టి సారించాల్సి వుంది.

పాత పంచాయతీ భవనంలో మూడు మద్యం కేసుల స్వాధీనం

వైసీపీ దాచిపెట్టిందన్న టీడీపీ ఫిర్యాదుతో వెలుగులోకి

1చంద్రగిరి, మే 1: చంద్రగిరి మండలం ఐతేపల్లె పాత పంచాయతీ భవనంలో మూడు మద్యం కేసులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పులిత్తివారిపల్లెలో పాత పంచాయతీ భవనం నిరుపయోగంగా వుండడంతో డీలర్ రేవతి అందులో ఓ గది తీసుకుని గ్రామానికి రేషన్ పంపిణీ చేస్తున్నారు. మరో గది తాళాలు పంచాయతీ కార్యదర్శి చంద్రబాబు.. ఐతేపల్లె సర్పంచ్ ఫజల్లా భర్త అంజాన్ ఖాన్‌కు ఇచ్చారు. అయితే పాత పంచాయతీ భవనంలో మద్యం కేసులను



పాత పంచాయతీ భవనం




పాత పంచాయతీ భవనంలో దాచిపెట్టిన మద్యం బాటిళ్లు

వైసీపీ నాయకులు దాచిపెడుతున్నారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులొచ్చి సర్పంచ్ భర్త వద్ద ఉన్న తాళాలు అడిగారు. తాళాలు తనవద్దలేవని, వైసీపీ కార్యకర్త నాగరాజుకు ఇచ్చినట్లు తెలిపారు. నాగరాజు అందుబాటులో లేకపోవడంతో పోలీసుల సాయంతో తాళాలను పగలగొట్టి తనిఖీ చేశారు. మూడు మద్యం కేసులను గుర్తించారు. అందులో 144 మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉన్నాయి. ప్రభుత్వ భవనంలో అక్రమంగా మద్యం దాటి పెట్టడాన్ని టీడీపీ నాయకులు చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి నిశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే.. వైసీపీ సర్పంచ్ భర్త ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలకు ఇవ్వడానికి మద్యం దాచిపెట్టినట్లు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పాకాల ఎక్సైజ్ సీఐ శ్రీహరి రెడ్డి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరు దాచిపెట్టారో దర్యాప్తులో తేలాక వారిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు.

పింఛన్ల పంపిణీలో మొదటి స్థానం

తొలిరోజు 23 శాతం పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), మే 1: జిల్లాలో మే నెలకు సంబంధించి బుధవారం 23 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. 2,72,867 మంది లబ్ధిదారులు ఉండగా, తొలిరోజు 62,735 మందికి రూ.17.28 కోట్లు అందజేశారు. తద్వారా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. కొందరికి డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతిలో బ్యాంకు ఖాతాలకు జమచేయగా, బ్యాంకు ఖాతాలు సరిగా లేని వారికి సచివాలయ సిబ్బంది నేరుగా అందజేశారు.

కందిపప్పు ఎక్కడ జగనన్నా..?

చిత్తూరు కలెక్టరేట్, మే 1: ఈనెల కోటాలోనూ కందిపప్పు ఊసేలేదు. ఎన్నికల వేళ కావడంతో రేషన్ దుకాణాల్లో కందిపప్పు ఇస్తారని కార్డుదారులు ఆశించారు. అయితే బియ్యంతోపాటు 200 టన్నుల గోధుమ పిండి, 200 టన్నుల రాగిపిండిని కేటాయించామని అధికారులు అంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ కందిపప్పు రూ.160 నుంచి రూ.180 మధ్యలో ఉండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనేందుకు ఇబ్బంది పడుతున్నారు.

అపార్టుమెంటులోచీరలు,నగదు సీజ్

తిరుపతి(నేరవిభాగం) మే 1 : ఓటర్లకు పంపిణీ చేసేందుకు దాచిపెట్టిన రూ.23 వేల విలువ చేసే 46 చీరలను, రూ 1.22 లక్షల నగదును బుధవారం తిరుపతి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.యూనివర్శిటీ సీఐ మురళీకృష్ణ కథనం మేరకు...తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని మిథిన్ అపార్టుమెంటులో కాపురమున్న సురేష్‌బాబు ఇంటిలో చీరలు, నగదు దాచి వుంచారని సమాచారం అందింది. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అపార్టుమెంటులో తనిఖీలు చేసి 46 చీరలను, రూ.1.22 లక్షల నగదును స్వాధీనం చేసుకుని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.అపార్టుమెంట్ యజమాని సురేష్‌బాబుతో పాటు విజయకుమార్, సత్యవతి అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



సీజ్ చేసిన చీరలు, నగదు

జడ్జి రామకృష్ణ ఇంటిపై దాడి

కిటికీల అద్దాలు... కారు అద్దాలు ధ్వంసం - రక్షణ కల్పించాలంటూ పోలీసులకు ఫిర్యాదు




దుండగులు పగులగొట్టిన కారు అద్దాలు



ధ్వంసమైన జడ్జి రామకృష్ణ ఇంటి కిటికీ అద్దాలు

రాయచోటి, మే 1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట పట్టణంలో నివాసం ఉంటున్న జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ ఇంటిపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఇంటికి వెనుక వైపు ఉన్న కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. కిటికీలకు అమర్చిన మెష్‌ను పీకి పక్కన పడేశారు. ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన ఇన్నోవా కారు అద్దాలను ధ్వంసం చేశా రు. ఈ ఘటన బుధవా రం ఉదయం పట్టణంలో చర్చనీయాంశమైం ది. ఈ ఘటనపై జడ్జి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వైసీపీ నాయకులపై తాను క్రిమినల్ కేసు పెట్టానని, తనను భయపెట్టి కేసులను ఉపసంహరింపజేసేందుకు వారు గూండాలను ఇంటిపై పంపించారని అన్నారు. పదేళ్లుగా తనకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మధ్య అనేక సంఘటనలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మరోసారి దాడి జరిగిందన్నారు. దుండగులు కిటికీల అద్దాలు పగులగొట్టి యాసిడ్‌ను లోపలికి చల్లేందుకు ప్రయత్నించారని, తనతో పాటు, కుటుంబసభ్యులను హతమార్చేందుకు ప్రయత్నం జరిగిందని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని అన్నారు. దుండగులు దాడికి యత్నిస్తున్న సమయంలో స్థానిక పోలీసులకు ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, దీంతో మదనపల్లె డీఎస్పీకి ఫోన్ చేయగా రాత్రి ఇద్దరు పోలీసులను పంపారన్నారు. బయటకు వచ్చి చూడగా తన కారు సైతం ధ్వంసం అయిందన్నారు. తమ ఇంటిపై ఎవరు దాడి చేయించారనే విషయంలో పోలీసులు స్పందించడం లేదని ఆరోపించారు. జగన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనను చాలా విధాలుగా వేధిస్తున్నారన్నారు. ఇటీవల తాను వైసీపీ నాయకులపై బి.కొత్తకోటలో ఓ క్రిమినల్ కేసు పెట్టానని, ఆ కేసును రిజిస్టర్ చేయకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. ఈ నేపథ్యంలో తన నివాసంపై దాడి జరిగిందని, సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావులేదని, ప్రజాస్వామ్య వాదులందరూ ఇటువంటి అరాచక చర్యలు, దాడులను ఖండించాలన్నారు.



జడ్జి రామక్రిష్ణ

ఆస్తి తగాదాలతో తమ్ముడే దాడి చేశాడు

బి.కొత్తకోటలో జడ్జి రామకృష్ణ నివాసంపై దాడిచేసిన వ్యక్తి ఆయన తమ్ముడు రామచంద్ర. ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదు. అన్నదమ్ములిద్దరికీ ఆస్తి తగాదాలు ఉన్నాయి. దీంతో రాత్రి రామచంద్ర కిటికీ అద్దాలు, కారు అద్దాలు ధ్వంసం చేశాడు. జడ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాము. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం.

- సూర్యనారాయణ, బి.కొత్తకోట సీఐ

మార్పు కోసం యువత ముందుకొస్తోంది

చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు

నగరి మే 1 : రాష్ట్రంలో అధికార మార్పు కోసం యువత ముందుకు దూసుకొస్తోందని చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, నగరి అభ్యర్థి భానుప్రకాష్ అన్నారు. నగరి పట్టణ పరిధిలోని టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం నియోజకవర్గంలోని యువకులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో యువత నిర్వీర్యమైందన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నమ్మపలికిన జగన్‌రెడ్డి యువతను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల వ్యాపారం పెంచారే గాని యువతకు ఉపాధినిచ్చే పరిశ్రమలను తేవడంలో విఫలమయ్యారన్నారు. నగరి ఎమ్మెల్యే రోజా ఆస్తులను పెంచుకోవడంలో చూపిన చొరవ నియోజకవర్గ అభివృద్ధిలో చూపలేదని విమర్శించారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమితోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. యువత తలచుకుంటే సాధ్యంకానిది ఏమీ లేదని, ప్రభుత్వ మార్పిడి దిశగా అడుగులు వేయాలని కోరారు. యువతకు భవిత కావాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి రాష్ట్రాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. తమకు చంద్రబబాబు హయాంలోనే న్యాయం జరిగిందని, జగన్ వచ్చాక ఉన్న పరిశ్రమలు కూడా ఖాళీ అయ్యాయని సాఫ్ట్‌వేర్ రంగంలోని యువకులు తెలిపారు. నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



దగ్గుమళ్ల ప్రసాదరావును సన్మానిస్తున్న టీడీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాశ్

పంట పొలాలపై ఏనుగుల దాడి



ఇర్లపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసి టమోటా పంట

సోమల, మే 1: మండలంలోని పేటూరు సమీప పొలాల్లో మంగళవారం రాత్రి ఏనుగుల మంద దాడి చేసింది. టమోటా, మామిడి, వరి పంటలను నాశనం చేశాయి. పేటూరుకు చెందిన సుబ్రమణ్యం మామిడి తోటలో డ్రిప్ పైపులను తొక్కి ధ్వంసం చేశాయి. ఇర్లపల్లె వద్ద మేకలు ఏనుగుల రాకను గుర్తించి పరుగులు పెట్టాయి. రామిశెట్టికుంట వద్ద మకాం వేసిన ఆరు ఏనుగులను రైతులు గుర్తించి, డప్పుల శబ్దం చేస్తూ పంటలకు కాపుకాశారు. టమోటా పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

జాతర కోసం వచ్చి మృత్యు ఒడికి..

చౌడేపల్లె, మే1: ఈతకెళ్లి బావిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. గంగజాతర కావడంతో చౌడేపల్లెలోని ఉదయ్ ఇంటికి తిరుపతికి చెందిన ఆయన బంధువు రమేష్‌బాబు(40)వచ్చారు. స్నేహితులతో కలసి ఈత కొట్టేందుకు చౌడేపల్లె సమీపంలోని బాలసిద్దప్ప వ్యవసాయ బావి వద్దకెళ్లారు. అందరూ ఈతకొట్టి పైకి రాగా రమేష్‌బాబు కనిపించలేదు. మళ్లీ బావిలోకి దిగి వెతికినా కనిపించకపోవడంతో అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తన రెస్క్యూ టీంతో కలసి బావిలో గాలించి, మృతదేహాన్ని బయటకు తీశారు. జాతర కోసం వచ్చి మృత్యు ఒడికి చేరుకోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.



మృతి చెందిన రమేష్‌బాబు



ఓసీ కాసులు ఎందుకు కొదులుకోవల్ల!

ప్రచారాలు జోరుగా సాగతా వుండాయిగదా ఇప్పుడు. కూలీ కాసులు గూడా బాగానే ముడతా వుండాయంట. ఆ పార్టీ ఈ పార్టీ అని లేకుండా ఏ పార్టీ ఎప్పుడు ప్రచారాలకీ, ర్యాలీలకీ పిలిస్తే వాటికి జనం పొలోమంటా ఎల్లిపోతా వుండారు. అర్ధపూటో లేకపోతే రెండుమూడు గంటలో మాత్రమే ఉంటాయి ఏ ప్రచారమైనా. ఇంతమాత్రానికే దినానికి ఐదు నూర్లు కాసులు, బిరియానీ ప్యాకెట్లు ఇస్తారు. మొగోళ్లకయితే క్వార్టరు మొందు బాటిలు ఎక్స్ట్రా. అందుకే పార్టీలమజ్జ తేడాలు చూపడంలేదు జనం. తాము ఓటు ఏసేది ఎవుర్కైనా పిలిస్తేసాలు పార్టీ ఏదని చూడకుండా పొలోమని ఎల్లిపోతా వుండారు. ఈ మజ్జ కుప్పంలో జరిగే ర్యాలీకి శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో అధికార పార్టీ జనాన్ని కూడే సింది. వాళ్లల్లో పక్కా టీడీపీ ఓటర్లు శానామందే ఉండారు. తాము వైసీపీ ర్యాలీకి ఎల్లినట్లు తెలిస్తే, టీడీపీ నాయకులు ఏమనుకుంటారో ఏంపాడో అని వాళ్లల్లో వారికే శంక అయిపొయ్యింది. అప్పుడు పార్టీ నాయకులకు వాళ్లనింకా ఫోన్లు వొచ్చినాయి. 'మేము వైసీపీ ర్యాలీకి ఎల్తావుండామప్పా. మనిషికి ఐదొందలు ఇచ్చినారు. బిరియానీ ప్యాకెట్లు కూడా ఇస్తారంట. మొగోల్లకు క్వార్టరు బాటిలు చేతిలో పెడ్తామని చెప్తావుండారు. ఊరికే వొచ్చే కాసులు, ఎందుకు కాలదన్నుకోవల్ల సెప్పండి? కానీ సత్తి ప్రెమానికంగా చెప్తావుండామప్పా. ఓటు మాత్రం మన సైకిలుమిందే గుద్దతాము' అని ఫోన్లుచేసి సెప్పి ప్రెమాణాలు గూడా సేసినారంట. వైసీపీ పార్టీవోల్లకు కూడా ర్యాలీకి వొచ్చిన జనంలో సగంమంది ఓట్లు తమకు పడేవి కావని తెలిసినా.. జనం కావల్ల కాబట్టి తెలియనట్లే గమ్మున ఐదు నూర్లు కాసులు పంచేసి పిల్సకపొయ్యినారంట.

- కుప్పం

● మీకు తెలుసా?

ఖైదీలకూ ఓటు

రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయ పౌరులకు ఓటు హక్కు ఉంటుంది. వివిధ కారణాల వల్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా... ఉండదా అనే ప్రశ్న చాలా మంది తలెత్తవచ్చు. అయితే ఖైదీలకు కూడా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. వివిధ నేరాల్లో జైలు శిక్షలు అనుభవిస్తున్న ఖైదీలు ప్రీవెంక్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయొచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ, తాము ఓటర్లమని, పోలింగ్ బూత్, ఓటరు క్రమసంఖ్యతో ఓటు వేసే అవకాశం కల్పించాలని రాతపూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి ఓటు వేసే అవకాశాన్ని అధికారులు కల్పిస్తారు.

- చిత్తూరు

పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు

ఎన్నికల అధికారులు మూడు రకాలుగా పోలింగ్ కేంద్రాలను విభజించారు. మొదటిది సాధారణ.. రెండోది సమస్యాత్మక.. మూడోది అత్యంత సమస్యాత్మకమైనవి. రాజకీయ పార్టీలు, తమ అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు, ఇతరేతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ విభజన జరిగింది.

● నోట్ దిస్ పాయింట్

సాధారణ పోలింగ్ కేంద్రం కంటే అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించి జియోట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసివుంటారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

- చిత్తూరు కలెక్టరేట్




జన చేతనం





నాయకుడికి దూరచూపు ఉండాలి. అభివృద్ధికి అర్థం తెలియాలి. విజన్ కొరవడిన పాలన వర్తమానంలో కూరుకుపోతుంది. భవిష్యత్ తరాలకు ద్రోహం జరుగుతుంది. అభివృద్ధి అంటే ఓట్లలెక్కలు కాదు. అభివృద్ధి అంటే కరెంటు ఛార్జీలు పెంచి, పన్నులు పెంచి, ధరలు పెంచి, మద్యం ఏరుల్లా పారించి... ఎడాపెడా బాదేసి సంక్షేమం అంటూ నగదు విదిల్చడం కాదు. అభివృద్ధి అంటే చదువుల పందిరి వేయడం. అభివృద్ధి అంటే ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం. అభివృద్ధి అంటే ఉపాధికి బాటలు పరవడం.. మరి ఒక్క ఛాన్స్‌తో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి చేసిందేమిటి? పాదయాత్రలో జిల్లా పారిశ్రామికాభివృద్ధిపై చెప్పిన మాటలన్నీ ఆచరణలో అమలయ్యాయా? అంతకుముందు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏం చేశారు? జిల్లా పారిశ్రామిక చిత్రపటంలో ఈ ఇద్దరు నేతల ముద్రలేమిటో చూద్దాం...

చిత్తూరు, ఆంధ్రజ్యోతి



విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబుకు ఉన్న పేరు 2014-19 నడుమ నిజం అని రుజువైంది. విభజన తర్వాత రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక రంగాన్ని ఎంచుకున్నారు. ఫలితం.. ఆ ఐదేళ్లలో దేశ, విదేశీ, బహుళ జాతి కంపెనీలెన్నో కొలువు దీరాయి. 2014-19 నడుమ లక్ష మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. ప్రజల జీవన ప్రమాణాలూ వృద్ధి చెందాయి.

2014-19 చంద్రబాబు హయాంలో వెలుగులు



టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాకు పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చాయి. రూ.19452 కోట్లతో పెద్ద, భారీ, చిన్న పరిశ్రమలు లక్ష మందికిపైగా ఉపాధి కల్పించాయి. వీటితో పాటు రూ.2200 కోట్ల పెట్టుబడితో 3 వేల ఎంఎస్ఎంఈలు సుమారు 60 వేల మందికిపైగా ఉపాధిని ఇస్తున్నాయి. టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటైన 11 ప్రసిద్ధ పరిశ్రమలు గురించి చెప్పుకుంటే.. సత్యవేడులో హీరో మోటార్స్, ఏర్పేడులో రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్, సన్నీ ఒపో టెక్, శ్రీసిటీలో యూఎస్‌జీ బోరాల్స్, టాటా స్మార్ట్ ఫుడ్, సుందరం ఫాస్టనర్స్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్, టీవీఎస్ బ్రేక్స్ ఇండియా లిమిటెడ్, గంగవరం మండలం గండ్రాజుపల్లెలో ఫామ్‌గేట్, విశ్వ అపరైల్స్, తొట్టంబేడులో కజారియా ఇండస్ట్రీస్ ఉన్నాయి. ఇక, సెల్‌ఫోన్లు, టెలివిజన్ సెట్ల తయారీలో అతిపెద్ద మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలు సెల్‌కాన్, ఫాక్సన్, డిక్సన్ వంటివి తిరుపతి, శ్రీసిటీలో ఉన్నాయి. ఛైర్‌మ్యాక్స్, గ్రీన్‌ప్లే, మొండెలేజ్, ఇసుజి, కోల్గేట్, కెలోగ్స్, షాహి ఎక్స్‌పోర్ట్స్ వంటి అతి భారీ పరిశ్రమలూ ఏర్పాటయ్యాయి. అమరరాజా విస్తరణలో భాగంగా యాదమరి మండలంలోనూ ప్లాంట్‌ను నెలకొల్పారు.

ఉమ్మడి జిల్లాలో పెద్ద, భారీ తరహా పరిశ్రమల ప్రగతి ఇలా

సంవత్సరం	పెట్టుబడులు (రూ.కోట్లలో..)	పరిశ్రమలు
2014-15	235	1,611
2015-16	398	2,104
2016-17	491	2,941
2017-18	826	2,377
2018-19	1076	10,419
మొత్తం	3,026	19,452



● ఇక, టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద, భారీ పరిశ్రమలు 2135 వచ్చాయి. వీటి ద్వారా 1,29,619 మంది ఉపాధి పొందారు.



2019 ఎన్నికల్లో గెలిచి జగన్‌రెడ్డి సీఎం అయ్యారు. అప్పటి దాకా ఉమ్మడి జిల్లాలో పనులు మొదలు పెట్టని పరిశ్రమల యాజమాన్యాలన్నీ ఏర్పాటు ప్రతిపాదనలను విరమించుకున్నాయి. కొత్త ప్రతిపాదనలూ లేవు. ఉన్నవి తప్పితే అదనంగా ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదు. అనేక పరిశ్రమలు విస్తరణను విరమించుకున్నాయి. రిలయన్స్ జియో వెనక్కి వెళ్లింది. అమరరాజ పొరుగు రాష్ట్రాలకు పారిపోయింది. జగన్‌రెడ్డి ప్రభుత్వం పాలనా తీరుకు కొలబద్దగా ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి స్తంభించిపోయింది.

2019-24 జగన్ పాలనలో చీకట్లు

కుప్పంలోనే 8 సంస్థలు వెనక్కి

వైసీపీ అధికారంలోకి వచ్చాక పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చిన యాజమాన్యాలతో చర్చించలేదు. పైగా ఉన్న పరిశ్రమల మీద కక్ష సాధింపు చర్యలకు దిగారు. ఈ పరిణామాలను చూసిన వారంతా పరిశ్రమల స్థాపనకు ముందుకు రాలేదు. కుప్పం నియోజకవర్గంలోనే దాదాపు రూ.3 వేల కోట్ల పెట్టుబడులు ఆగిపోయాయి. బ్రిటానియా, ఆదిత్యా బిర్లా, వైష్ణవి మెగా ఫుడ్‌పార్కు, తిరుపూర్ గార్మెంట్స్ వంటి ఎనిమిది సంస్థలు రాలేదు. ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై పాదయాత్రలో ఇచ్చిన హామీలనూ జగన్ నెరవేర్చలేదు.

జిల్లా పారిశ్రామిక చిత్రపటం

అక్కడితో వదిలేశారు



గంగాధరనెల్లూరులో టీడీపీ ప్రభుత్వం పరిశ్రమల కోసం 25 ఎకరాలను తీసుకుని రహదారులు అభివృద్ధి చేసి, విద్యుత్తు సౌకర్యం, మౌలిక వసతులు కల్పించింది. అప్పట్లో ఐదు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వైసీపీ వచ్చిన ఈ ఐదేళ్లలో ఇటువైపు కన్నెత్తి చూసేవాళ్లు లేరు. ఇంకా సుమారు 20 ఎకరాల స్థలమున్నా ఇతర పరిశ్రమల ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం చొరవ చూపలేదు.

'గుండ్రాజుపల్లె'ను విస్మరించారు

గంగవరం మండలం గండ్రాజుపల్లెలో 482 ఎకరాల భూమిని రూ.96 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కర్ణాటక సరిహద్దున ఉన్న ఈ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పిస్తే పరిశ్రమలు ఏర్పాటవుతాయి. తద్వారా యువతకు ఉపాధితో పాటు, ఈ ప్రాంతమూ అభివృద్ధి చెందేది. ఈ దిశగా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఒక్క భారీ పరిశ్రమా తేలేకపోయిన వైసీపీ

జిల్లాల పునర్విభజనతో భారీ పరిశ్రమలు, విద్యాసంస్థలు తిరుపతి జిల్లాలో ఉండిపోయాయి. ఈ క్రమంలో చిత్తూరు జిల్లాను అభివృద్ధి చేయడంపై ఇక్కడి మంత్రులు, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టలేదు. 2023లో రూ.90 కోట్లతో 651.. 2022లో రూ.13.74 కోట్లతో 334 ఎంఎస్ఎంఈ పరిశ్రమలు ప్రారంభించామని గతేడాది ఆగస్టు 15న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉషశ్రీచరణ్ తన ప్రసంగంలో చెప్పారు. క్షేత్రస్థాయిలో వీటి పరిస్థితి ఏంటో మరి. ఇక, ఒక్కటంటే ఒక పెద్ద పరిశ్రమ జిల్లాకు రాలేదని అధికారికంగా అంగీకరించారు.

'కోసలనగరం'నూ పట్టించుకోలేదు



తమిళనాడు సరిహద్దు అయిన విజయపురం మండలం కోసల నగరంలో పరిశ్రమల స్థాపనకు టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాటి ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు చొరవతో.. 2017లో 650 ఎకరాలు, 2018లో 1520 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించారు. 200 ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు కొందరు పారిశ్రామికవేత్తలు ఎంవోయూ చేసుకున్నారు. నీళ్లు, కరెంటు వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. దీనికోసం కృష్ణయ్య కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలుగుగంగ నీటిని శ్రీహరిపురం చెరువుకు తీసుకొచ్చి.. అక్కడ్నుంచి ఎత్తిపోతల ద్వారా ఈ పారిశ్రామిక వాడకు నీటి వసతి కల్పించాలని నిర్ణయించారు. విద్యుత్ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పరిశ్రమల గురించి పట్టించుకోలేదు. కాకుంటే, ఇటీవల 29 మంది రైతులకు భూమికి సంబంధించి పరిహారం ఇచ్చారు. మామిడి చెట్లకు ఇవ్వలేదని చెబుతున్నారు. ఇక, నగరి మండలం వీకేఆర్‌పురం పంచాయతీలో 250 ఎకరాలను టీడీపీ హయాంలోనే సేకరించారు. ఇక్కడా పరిశ్రమల ప్రస్తావన లేదు. ఈ ఐదేళ్లలో రైతులకు పరిహారం ఇచ్చి, మౌలిక వసతులు కల్పించి పరిశ్రమలను తీసుకొచ్చేందుకు మంత్రి రోజా చొరవ చూపలేదు. దీంతో 10 వేల మందికిపైగా ఉపాధి లేకుండా పోయింది.

- నగరి

అమరరాజను వేధించి వెళ్లగొట్టారు

రేణిగుంట మండలం కరకంబాడి వద్ద 1985 డిసెంబరులో గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి దంపతులు అమరరాజా బ్యాటరీస్‌ను స్థాపించారు. రూ.11 వేల కోట్లకు పైగా వార్షిక టర్నోవర్‌తో నడుస్తున్న ఈ పరిశ్రమ జిల్లాలో 16 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ లక్ష మంది ఉపాధి పొందుతున్నారు. వైసీపీ అధికారంలోకి రావడంతోనే అమరరాజపై వేధింపులు మొదలయ్యాయి. యాదమరి మండలం నూనెగుండ్లపల్లె వద్ద కూడా అమరరాజా సంస్థ బ్యాటరీల తయారీ ప్రారంభించింది. ఈ రెండు చోట్లా తొమ్మిది యానిట్ల వల్ల కాలుష్యం ఏర్పడుతోందంటూ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జారీ చేసిన ఆదేశాలతో 2021 మే 1న ఎస్పీడీసీఎల్ విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో సంస్థకు రూ.50 కోట్ల మేర నష్టం వాటిల్లింది. తర్వాత కూడా వేధింపులు కొనసాగాయి. దీంతో జిల్లాలో రూ.9500 కోట్లతో నెలకొల్పాల్సి ఉన్న లిథియం బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఆ సంస్థ తెలంగాణకు తరలించింది. దీనివల్ల జిల్లాలోని 4500 మంది ఉపాధి కోల్పోయారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా వున్న వాటిని వెళ్లగొట్టేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుపై జనం మండిపడుతున్నారు.



టూచ్...! ఒక్క పరిశ్రమా ఏర్పాటు కాలేదు

● పుంగనూరులో భూసేకరణ, శంకుస్థాపనలతోనే సరి

పుంగనూరులో 2,200 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటవుతుంది. ఉద్యోగ, ఉపాధి కోసం యువత ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు.

అలాగని చెప్పి మూడు చోట్ల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఒక్క దానికి కూడా అడుగులు పడలేదు.

- పుంగనూరు



శంకుస్థాపనతో సరి

పరిశ్రమ పేరు: జిక్సిన్ వారి సిలిండర్లు, బ్యాటరీల తయారీ, **సేకరించిన భూములు:** 38 ఎకరాలు
ఎక్కడ: పుంగనూరు మండలం మిట్టచింతలపల్లె వద్ద, **పెట్టుబడి:** రూ.57 కోట్లు ,**ఉపాధి:** 900 మందికి
శంకుస్థాపన జరిగింది: 2021 జూలై ఒకటో తేది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్ రెడ్డి, రెడ్డెప్ప, కంపెనీ ఎండీ రాహుల్ కరణం శంకుస్థాపన పాల్గొన్నారు.

ఆ తర్వాత ఏం జరిగింది

కంపెనీ ఎండీ రాహుల్ హత్యకు గురయ్యారు. పరిశ్రమ అటకెక్కింది. ఆ స్థలం నిరుపయోగంగా ఉంది.

ఏడాదిగా ఇంతే

పరిశ్రమ పేరు: ఫెర్రో అల్లాయ్స్ డీఐ పైపుల పరిశ్రమ
కేటాయించిన స్థలం: 62.47 ఎకరాలు
పెట్టుబడి: రూ.165 కోట్లు
ఎక్కడ: పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద
శంకుస్థాపన చేసింది: 2023 మార్చి 24న
ఉపాధి: ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా 600 మందికి
తర్వాత ఏం జరిగిది: పరిశ్రమ ఏర్పాటుకు పక్కనే యుద్ధప్రాతిపదికన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. ఆ తర్వాత ఎలాంటి నిర్మాణాలు జరగలేదు.





శంకుస్థాపన చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి(ఫైల్‌ఫొటో)



గాయత్రి సిలెండర్ల ఫ్యాక్టరీకి వేసిన శిలాఫలకం, స్థలం

అనుమతి లేకుండానే..!

పరిశ్రమ పేరు: గాయత్రి సిలెండర్స్ ప్రైవేటు లిమిటెడ్
పారిశ్రామిక వేత్త: మదనపల్లెకి చెందిన వైసీపీ నేత జబ్బల శ్రీనివాసులు
శంకుస్థాపన జరిగింది: ఆరడిగుంట వద్ద 2022 ఆగస్టు 21వ తేది
ఆ తర్వాత ఏమైంది: ప్రభుత్వ అనుమతిలేకుండానే ప్రక్రియ నడిచింది. చివరకు భూమి నిరుపయోగంగా, శిలాఫలకం దిష్టిబొమ్మగా కనిపిస్తోంది.

ఎన్నికల ముందు పరిశ్రమల పేరిట హడావిడి

తన నియోజకవర్గంలోనే మూడు పరిశ్రమలకు భూసేకరణ జరిపి వదిలేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఎన్నికలకు ముందు మరోసారి పరిశ్రమల హడావిడి చేశారు. భూసేకరణ పేరిట గ్రామస్థులను ఆందోళనకు గురిచేశారు.

పరిశ్రమ పేరు: జర్మనీకి చెందిన పెప్పర్‌మోషన్ ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల తయారీ, **స్థల పరిశీలన:** గతేడాది డిసెంబరు ఒకటో తేది
ఎక్కడ: పుంగనూరు మండలం గోపిశెట్టిపల్లె సమీపంలోని 800 ఎకరాల్లో
పెట్టుబడి: రూ.5 వేల కోట్లు, **ఉపాధి:** 10 వేల మంది
విస్తరణ: రెండు వేల ఎకరాల్లో మరో పది కంపెనీలు
లక్ష్యం: 2027కు మార్కెట్‌లోకి 50 వేల వాహనాలు తేవడం
ఏమైంది: ఇంత ఆర్భాటం చేసి, సీఎం జగన్‌ను రెండుమార్లు కలిసినా ఇంతవరకు పరిశ్రమ ఊసేలేదు., **గ్రామంలో పరిస్థితి:** మా ప్రాణాలు పోయినా భూములివ్వబోమని రైతులు తేల్చి చెప్పారు. బలవంతంగా భూములు తీసుకుంటే మాకు చావే గతి అన్నారు. ఆందోళనలు చేశారు.

జర్మనీ పెప్పర్‌మోషన్ ఎలక్ట్రిక్ వాహన తయారీ పరిశ్రమ స్థాపన స్థలాన్ని పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు(ఫైల్‌ఫొటో)



పలమనేరు
కుప్పం/పుంగనూరు

చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించండి



చెల్దిగానిపల్లెలో శంఖారావం కార్యక్రమంలో టీడీపీ నేతలు

రామకుప్పం, మే 1: టీడీపీ అధినేత చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహకకార్యదర్శి ప్రనారాయణాచారి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ఎంపీపీ చిన్నకృష్ణలు కోరారు. బుధవారం మండల పరిధి చెల్దిగానిపల్లె పంచాయతీలో వారు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సురేష్, రెడ్డిపురుషోత్తం, మంజునాథ్, చిన్నసురేష్ తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత టీడీపీని ఆదరించాలి



ముద్దనపల్లెలో ప్రచారం చేస్తున్న వెంకటాచలం తదితరులు

రామకుప్పం, మే 1: బంగారు భవిష్యత్తు కోసం యువత టీడీపీని ఆదరించాలని తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాలం, నియోజకవర్గ ప్రధానకార్యదర్శి శంకర్‌చలం కోరారు. బుధవారం ముద్దనపల్లె, రామకుప్పం పంచాయతీల్లో వారు 'బాబును మళ్లీ రప్పిద్దాం' కార్యక్రమంలో భాగంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో నేతలు వెంకటరమణ, అవినాశ్, బ్రహ్మానందం, సురేష్, ఉమేష్‌గౌడ, భాస్కర్, రఘు, రామాంజులు, మంజునాథ్, ఆనంద్, సనావుల్లా పాల్గొన్నారు.

పేదలను సంపన్నులను చేసేలా ఉమ్మడి మేనిఫెస్టో



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఇతర టీడీపీ నేతలు

శాంతిపురం, మే 1 : పేదలను సంపన్నులను చేసేలా ఉమ్మడి మేనిఫెస్టో ఉందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ రెస్కో వైస్ ఛైర్మన్ చలపతిస్వామి, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ ఎస్ మణి, ఎల్ జయరామిరెడ్డి, గోపాల్ అన్నారు. బుధవారం మండల పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి రెండు లక్షలపైన లబ్ధి చేకూరేలా మేనిఫెస్టో ఉందన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రకులాలకు లబ్ధిచేకూరేలా పథకాలను రూపొందించడం హర్షణీయమన్నారు. 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పింఛన్లు ఇవ్వనుండడం ఆనందంగా ఉందన్నారు. కూటమికి 160 సీట్లు రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నారాయణరెడ్డి, మణి, గోపాల్, జయారెడ్డి, మురళి, సుబ్రమణ్యం, శేఖర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఓట్ల మెజారిటీలో కుటుంబ సాధికారతులే కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

శాంతిపురం, మే 1 : కుప్పంలో చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే కుటుంబ సాధికారతులే కీలకమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి తెలియజేశారు. బుధవారం మండలంలోని 12 యూనిట్ల పరిధిలోని 52 బూత్‌లకు సంబంధించిన కుటుంబ సాధికారత సారథులతో ఆయా పంచాయతీ కేంద్రాలలో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావశాల్లో వారు మాట్లాడుతూ 60 మంది ఓటర్లకు ఒక కుటుంబ సాధికార సారథి బాధ్యత తీసుకుని వారికి మేనిఫెస్టో గురించి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు చంద్రశేఖర్, జాని, యూనిట్ ఇన్‌చార్జిలు మణి, జయారెడ్డి, గోపాల్, రుద్రప్ప, పెద్దన్న, నారాయణస్వామి, మునిరెడ్డి, బాలు, భాస్కర్, ప్రకాష్, అంజనేయరెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం పోరాడాలి

పుంగనూరు రూరల్, మే1: కార్మికుల హక్కులను పోరాడి సాధించుకోవాలని కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా బుధవారం విద్యుత్ సబ్‌స్టేషన్, మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మిక జెండాలను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్మికులు, విద్యుత్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, నాయకులు భాస్కర్, మురళి, నాగరాజ పాల్గొన్నారు.

కూటమి నేతలకు పాలాభిషేకం



కుప్పం రూరల్, మే 1: కుప్పం మండలంలోని మల్లానూరులో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కూటమి నేతలైన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లున్న ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ రాష్ట్రానికి వెలుగులు పంచనున్న నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అని పేర్కొన్నారు. ప్రజలు చంద్రబాబును లక్ష ఓట్లు మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబశివం, క్లస్టర్ ఇన్‌ఛార్జి రామచంద్ర, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పార్థసారథి, పార్టీ నాయకులు సుబ్బు, దామోదర్, మోహన్, సుధాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



శాంతిపురం, మే 1 : సంక్షేమం, అభివృద్ధి మిళితంగా రూపొందించిన ఉమ్మడి మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబు చిత్రపటానికి తెలుగు మహిళ నేతలు పాలాభిషేకం చేశారు. రాళ్లబూదు గూరు గ్రామంలో బుధవారం కుప్పం నియోజక వర్గం మహిళ అధ్యక్షురాలు అనుసూయ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళ నేతలు సుగుణమ్మ, క్రిష్ణప్రియ, మంజుల, కవిత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

రామకుప్పం: రామకుప్పం మండల పరిధిలోని అటవీప్రాంతంలో ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం విస్తృత దాడులు చేశారు. అడ్డగట్టు తాండా, టేకుమానుతాండా, కుళ్లగానూరు అటవీప్రాంతాల్లో చేసిన ఈ దాడుల్లో 300లీటర్ల సారా ఊటను, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు.

4న పలమనేరుకు జగన్

పలమనేరు మే1 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 4వ తేదీ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సీఎం జగన్ పలమనేరుకు రానున్నట్లు వైసీపీ మండల అధ్యక్షులు బాలాజినాయుడు తెలిపారు. ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి జగన్ ప్రసంగిస్తారని తెలిపారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: అమర్




టీడీపీలో చేరిన బత్తనపల్లి గ్రామస్తులు, గంగవరం మండలం కొత్తపల్లెలో ప్రచారం చేస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మే1 : పలమనేరు టీడీపీ కార్యాలయంలో బుధవారం బత్తనపల్లి గ్రామస్తులు తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో రమేష్‌బాబు, శీనప్ప, బాబు ఉన్నారు.

బైరెడ్డిపల్లె: రాష్ట్ర ప్రజలకు ఎంతో ప్రయోజనకరమైన సూపర్‌సిక్స్ పథకాలు కావాలంటే టీడీపీని గెలిపించాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని దాసార్లపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామాపురంలో పలువురు టీడీపీలో చేరారు. ● చప్పిడిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మేడే సందర్భంగా మండలంలోని శివాడిలో సునీతాజోసెఫ్ చర్చిలో సెయింట్ జోసెఫ్ ఫీస్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎంపీపీ విజయ భాస్కరరెడ్డి హాజరయ్యారు. ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో వైసీపీ నాయకులు లక్ష్మీనారాయణ, కనకరాజు, అమూల్ రాజు, రాజేష్, శౌరిరాజ్, శశికుమార్, సుబాన్‌సాబ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. అనంతరం అప్పినపల్లె పంచాయతీలో ప్రచారం చేశారు. ముద్దేపల్లెకు చెందిన యువకులు పార్టీలో చేరారు.

గంగవరం: మండలంలోని కొత్తపల్లె గ్రామంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని టీడీపీ. జనసేన, బీజేపీ శ్రేణులందరూ కలసికట్టుగా పనిచేసి టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, రాము, శివరామిరెడ్డి, మొగిలప్ప, మొగిలిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

దళితులను చంపి డోర్ డెలివరీ చేసే వైసీపీని ఓడిద్దాం



కొలమడుగు కొత్తూరు ఎస్సీ కాలనీలో ప్రచారం చేపడుతున్న మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు, దళిత నేతలు

శాంతిపురం, మే 1 : దళితులను చంపి డోర్ డెలివరీ చేసే వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని మాజీ ఎంపీపీ పుష్ప, జడ్పీటీసీ శకుంత, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు దేవరాజ్ మాదిగ అన్నారు. బుధవారం మండలంలోని కొలమడుగు కొత్తూరు, మఠం, కోనేరుకుప్పం రామనగర్ కాలనీ తదితర దళిత కాలనీలలో టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహిం చారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వంలో దళితులకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కరోన సమయంలో మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్‌ను నడి రోడ్డుపైన అతి దారుణంగా అవమానించి పిచ్చివాడని ముద్రవేసి చంపేశారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ అనంతబాబు తన వద్ద పనిచేసే డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశారని తెలిపారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వచ్చిందంటే రాష్ట్రంలో దళితులకు రక్షణ ఉండదని హెచ్చరించారు. అందుకే టీడీపీని గెలిపించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు వేణు, రమేష్, కోదండ, జయరాం, సతీష్, వంశీ, సుబ్రమణ్యం, నారాయణస్వామి, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో 82.73 శాతం పెన్షన్ల పంపిణీ

పలమనేరు, మే1 : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో నాన్ డీబీటీ పెన్షన్లు 82.73 శాతం మందికి బుధవారం పంపిణీ చేశామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. పలమనేరు మున్సిపాలిటీలో మొత్తం 4,694 మంది పెన్షన్లు ఉన్నారని, ఇందులో బ్యాంకు ఖాతాలున్న 3215 మందికి వారి పెన్షన్లను జమచేశామన్నారు. ఖాతాలేని పెన్షనర్లు 1280 మంది ఉన్నారని తెలియజేశారు. దీంతో బుధవారం 1059 మందికి సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారని వివరించారు.

పెద్దిరెడ్డి అరాచకాలను అంతం చేద్దాం





పుంగనూరు మండలం దండుపాళ్యంలో చల్లా రామచంద్రారెడ్డి, పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లెలో చల్లా పూజారెడ్డి, రొంపిచెర్ల మండలం చిచ్చిలివారిపల్లి మండలంలో చల్లా సుప్రియారెడ్డి ప్రచారం

పుంగనూరు, మే 1: పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలు అంతం చేద్దామని ఇందుకోసం ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించి గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పుంగనూరు మండలం దండుపాళ్యం, మల్లుపల్లె, రాగానిపల్లె, బైనిగానిపల్లె, అడవినాథునికుంట, లక్కుంట తదితర గ్రామాల్లో ఆయన రోడ్డుషో, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీలను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ మూడు రోజుల నుంచి పుంగనూరులో ప్రతిపక్షపార్టీలపై దాడులకు పాల్పడి మళ్లీ వారిపైనే హత్యాయత్నం కేసులు నమోదు చేస్తున్న పోలీసుల తీరు గర్హనీయమన్నారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు, హత్యాయత్నం కేసులు బనాయించి ఎన్నికల్లో వారు పనిచేయకుండా పెద్దిరెడ్డి కుట్రలకు తెరతీశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శమిపతి, ఆర్వీటీ బాబు, సుబ్రహ్మణ్యంరాజు, సుహేల్‌బాషా, గంగాధర్, చలపతినాయుడు, నాగరాజయాదవ్, పతిరాజు, ప్రదీప్ రాజు, పురుషోత్తంరాజు, రామయ్య, మోహన్‌నాయుడు, కవిత, గిరిబాబు, ప్రసాద్, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్నారాయల్, విరూపాక్షి, హరినాయక్, శ్రీనివాసులు, వెంకటేశ్, బీజేపీ నాయకురాలు మల్లికారాణి తదితరులు పాల్గొన్నారు.

సోమల: టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో వల్లిగట్లలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు విశ్వనాథం, సుబ్బరాయులు, రెడ్డెప్ప, కందూరు మాజీ ఎంపీటీసీ శ్రీని వాసులు, శంకర్, శ్రీనివాసులు, సత్యన్న తదితరులు పాల్గొన్నారు. ● జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం రాయల్ ఆధ్వర్యంలో గురికానివారిపల్లెలో ప్రచారం చేశారు. ● సోమల పంచాయతీలో పీఎం.మల్లికార్జున, శివశంకర్, మహేంద్రబాబు, మణి తదితరులు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు.

రొంపిచెర్ల: పులిచెర్ల మండలం అరికెలవారిపల్లె, ఆర్‌కురవపల్లెకు చెందిన పాండు, శివ కుటుంబసభ్యులతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. చల్లాబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే సదుం మండలం గొంగివారిపల్లె పంచాయతీలోని వైసీపీ కి చెందిన పది కుటుంబాల వారు టీడీపీలో చేరారు. రాజన్న, మల్లికార్జున బండిశివ, సునీల్ కుమార్ తదిరులు పార్టీలో చేరారు. ● మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీలోని గ్రామాల్లో చల్లా బాబు సతీమణి సుప్రియారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో మదనమోహన్, నారాయణ, రఘు పాల్గొన్నారు.

కల్లూరు: రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని గెలిపించుకుందామని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కుమార్తె చల్లా పూజారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, మురళీనాయుడు, కుమార్ రెడ్డి, భాస్కర్, మోహన్‌దాస్, మునీంద్ర, రమేష్ రాజేష్, మహేష్, బాబయ్య, సుబ్బరాజు, సురేష్, రాజన్న, సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

చౌడేపల్లె: దేశంలోనే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి పేర్కొన్నారు. ఆమె మండలంలోని లద్దిగం పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రవదనమ్మ, విజయలక్ష్మి, నాయకులు చంద్రబాబు, కిరణ్ పాల్గొన్నారు.

తిరుపతి గంగమాంబ ఆలయ అభివృద్ధే టీడీపీ ధ్యేయం



ఆలయ అభివృద్ధి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మే 1: కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవాలయ అభివృద్ధికి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధ వారం ఆయన టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, గంగమ్మ గుడి మాజీ ఛైర్మన్లు, మాజీ డైరెక్టర్లు, పూజారుల బృందంతో సమావేశమయ్యారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనుల వివరాలు ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి గంగమాంబ ఆలయాన్ని 1996లో చంద్రబాబు హయాంలో సుమారు రూ.20 లక్షలతో అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆలయ ముఖద్వార మండపాన్ని, కింది భాగం నుంచి గోపురం వరకు కట్టడాన్ని రాతితో నిర్మిస్తామని చెప్పి సిమెంటుతో నాసిరకం పనులతో నిర్మిస్తున్నారని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయం, ముత్యమారెమ్మ ఆలయం, వినాయకస్వామి ఆలయం ముఖ మండపాలను రాతితో నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. శిథిలావస్థలో ఉన్న పెద్దబావిని పునర్ నిర్మిస్తామన్నారు. అమ్మవారి జలావాసం జరిగే ఆర్టీసీ బస్టాండు సమీపంలోని బావిని సైతం పునర్నిర్మిస్తామన్నారు. అమ్మవారి అగ్నిగుండ ప్రవేశ స్థలంలో ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మిస్తామని తెలియజేశారు. ఉత్సవాల సమయంలో పొంగళ్లు పెట్టుకోవడానికి, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్థలాన్ని కేటాయించి షెడ్లు నిర్మాణం చేస్తామన్నారు.

టీడీపీకి ఓటుతోనే వైసీపీ అరాచకాలకు చెక్



చిన్నకుర్లపల్లెలో ప్రచారం చేస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, మే 1: తెలుగుదేశం పార్టీకి ఓటేస్తేనే వైసీపీ అరాచకాల ఆట కట్టించవచ్చని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని 10వ వార్డు చిన్నకురపల్లెలో బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయిదేళ్ల దుర్మార్గ జగన్ పాలన అంతమయ్యే రోజులు దగ్గర పడ్డా యన్నారు. ప్రజలకు అండగా నిలిచిన ప్రతిపక్షాల నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లపాలు చేశారన్నారు. ఒక్కసారి ప్రజలందరూ గతంలో చంద్రబాబు పాలనను గుర్తుచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అప్పట్లో శాంతి భద్రతలు క్షేమంగా ఉండడ మేకాక, అభివృద్ధి శరవేగంగా పరుగులు తీసిందని చెప్పారు. మళ్లీ చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటే ఆరోజులు తిరిగి వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పోలింగ్ బూత్‌కు వచ్చి సైకిల్‌పై ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ద్వారా ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు

సిబ్బందితోపాటు వైసీపీ నేతలపై టీడీపీ ఫిర్యాదు



ఎంపీడీవో కార్యాలయలో ఫిర్యాదును అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 2: రామకుప్పం మండలంలో ఉపాధి హామీ పథకం అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని టీడీపీ నేతలు మునస్వామి, పత్ర నారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, జయశంకర్, మనోహర్, కామరాజనాయక్‌లు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మండలంలో నామమాత్రపు పనులు చేపడుతూ 1992మంది కూలీలు పనుల్లో పాల్గొన్నట్టు మస్టర్లలో పేర్లు నమోదు చేశారని తెలియజేశారు. కూలీలు కాని వారి ఖాతాలకు ఖాతాలకు ఉపాధి హామీ పథకం డబ్బులు పడేలా చేసి ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని పేర్కొన్నారు. ఏపీవోతో పాటు సిబ్బంది వైసీపీ నేతలు కలిసి అవకతవకలకు పాల్పడుతున్నారని వివరించారు. ఎంపీడీవో మస్టర్లను పరిశీలించాలని, వైసీపీ నేతలకు కొమ్ముకాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ

శాంతిపురం, మే 1 : ఆదర్శ పాఠశాల ఆరవ తరగతి ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు సత్తాచాటారు. నెల క్రితం ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షలు ప్రభుత్వం నిర్వహించింది. ఆ పరీక్ష ఫలితాలను మగళ వారం విడదల చేసింది అందులో నడింపల్లె, మఠం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ప్రణీత్, నిఖిల్ మం డల టాపర్లుగా నిలిచారు. వారిని హెచ్‌ఎంలు ఉమాపతి, సుగుణకుమారి, గ్రామస్తులు, సహచర విద్యార్థులు అభినందించారు.




నిఖిల్, ప్రణీత్

కుప్పం చేరిన 582 ఈవీఎంలు

కుప్పం, మే 1: కుప్పం నియోజకవర్గానికి సంబంధించి 582 ఈవీఎంలు కుప్పం చేరాయి. ఎంఎఫ్‌సీ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో వీటిని భద్రపరిచారు. నియోజకవర్గంలో 243 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. పార్లమెంటు స్థానానికి 291 ఈవీ ఎంలు, అసెంబ్లీ స్థానానికి మరో 291 ఈవీఎంలు వంతున వచ్చాయి. అంటే అదనంగా 96 ఈవీఎంలు రిజర్వ్‌లో ఉం టాయి. ఎక్కడైనా ఈవీఎంలలో సమస్యలు ఎదురైతే రిజర్వ్‌లో పెట్టిన ఈవీఎంలను అక్కడికి చేర్చి పోలింగ్ కొనసాగిస్తారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర



అమ్మవారికి గట్టం కుండలు తీసుకెళుతున్న భక్తులు

చౌడేపల్లె, మే1: చౌడేపల్లె నడివీధి గంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారిని నడివీధిలో ప్రతిష్ఠించారు. వేకువజాము నుంచి గ్రామ నలుమూల ఉన్న మారెమ్మ, చౌడేశ్వరమ్మ, నల్లగంగ్మ, గుంటి గంగమ్మలు, నడివీధి గంగమ్మలకు మహిళలు మంగళ వాయిద్యాల నడుమ దివ్వెలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి దున్నపోతును బలిగా సమర్పించారు.

భక్తులకు అన్నదానం



చౌడేపల్లె, మే1: చౌడేపల్లె గంగమ్మ జాతరలో భక్తులకు టీడీపీ కార్యకర్త బోజనాలరెడ్డి అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు, వ్యాపారవేత్తలు పురుషోత్తమరాజు, లక్ష్మీపతిరాజు ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, హరిప్రసాద్, కార్తీక్, అనిల్ రాజు, ప్రభాకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ సేవలో ఎన్నికల పరిశీలకులు

చౌడేపల్లె, మే1: బోయకొండ గంగమ్మను పీలేరు, తంబళ్లపల్లె నియోజ కవర్గం ఎన్నికల పరిశీలకురాలు కవిత దర్శించుకున్నారు. బుధవారం ఆమె అమ్మవారి దర్శనం కోసం కుటుంబ సమేతంగా రాగా ఆలయ అధి కారులు ఆమెకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ ఈవో చంద్రమౌళి ఆమెకు అమ్మవారి చిత్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

రోగులకు పాలు, పండ్లు వితరణ



రామకుప్పం, మే 1: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రామకుప్పం మండల స్వర్ణాంధ్ర తాపీమేస్త్రీ సంఘం వారు రామకుప్పం పీహెచ్‌సీ వద్ద ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు మునిరాజు, ఖాదర్‌బాషా, మహబూబ్, బాబాసాబ్, మౌలా, వెంకటరమణ పాల్గొన్నారు. ● స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ కేఎస్. రాజన్ జ్ఞాపకార్థం వారి కటుంబ సభ్యులకు పంచాయతీ కార్మి కులకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

పలమనేరు, మే1 : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కార్మికులందరికీ సమాన పనికి సమానవేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వీఆర్‌జ్యోతి డిమాండ్ చేశారు. బుధవారం మే డే సందర్భంగా పలమనేరులో మేడే జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వీఆర్‌జ్యోతి మాట్లాడుతూ కార్మికుల హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలన్నారు. ఐఎఫ్ టీయూ జిల్లా ఉపాధ్యక్షులు యోగేష్‌బాబు, జిల్లా రైతు సంఘం నాయకులు ఉమాపతి నాయుడు, సామాజిక కార్యకర్త మధుమోహన్ రావు, బైరెడ్డిపల్లి మండలం నుంచి శకుంతల, రోజా, తిప్పక్క, సరోజ, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ సందర్శన

వెదురుకుప్పం, మే 1: ఎన్నికల నేపథ్యంలో వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న సందర్శించారు. బుధవారం ఆమె కార్యాలయాన్ని సందర్శించి ఉప తహసీల్దార్ కోమల, సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

కార్మిక చట్టాలను కాలరాస్తే సహించం





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, నగరిలో ర్యాలీగా వెళుతున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు రూరల్, మే 1: ఎన్నో ఏళ్ల క్రితం అనేక మంది ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తా ఉంటే చూస్తూ ఊరుకోమని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజన్ హెచ్చరించారు. నగరంలో మే డే వేడుకలు బుధవారం కార్మిక సంఘాలు, లెఫ్ట్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడం కారణంగా డీఐ రోడ్డులోని అన్నా మైదానంలో మేడే దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణి, రమాదేవి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నగరి: నగరి టవర్‌క్లాక్ వద్ద సీఐటీయూసీ ఆధ్వర్యంలో, నాగలాపురం రోడ్డులో ఏఐటీయూసీ నాయకులు, టీడీపీ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ నాయకులు మే డే వేడుకలు జరుపుకొన్నారు. టీఎన్‌టీయూసీ నాయకుడు జ్యోతినాయుడు, ఏఐటీయూసీ కార్యదర్శి కోదండయ్య, అంగన్‌వాడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పతాకాన్ని ఆవిష్కరించారు.

బంగారుపాళ్యం : మండంలోని పలు గ్రామాల్లో మేడేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరగొండ రోడ్డులోని భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు మురళీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నణి, సుబ్రహ్మణ్యం, బాలాజి, కన్నయ్య, అల్లాబాషా తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని పలుచోట్ల కార్మికులు, ఆటో డ్రైవర్లు మేడే జరుపుకొన్నారు. పి.కొత్తకోట అంబేడ్కర్ సర్కిల్ వద్ద జెండా ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జ్యోతినాథ్, మురళి, త్యాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల వరకు రైతు రుణ మాఫీ : కాంగ్రెస్



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి

నగరి మే1: కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ నగరి అభ్యర్థి పోచారం రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. నగరి మండలం తడుకుపేట, కృష్ణాపురం, కావేటిపురం, కృష్ణారామాపురం, బుగ్గఅగ్రహారం, ఎం.కొత్తూరు, వేలావడిలలో ఆయన బుధవారం ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాబు, డిల్లీ, నాగేశ్వరరావు, చిరంజీవిరెడ్డి, రత్నం, దివాకర్, గోపిరాయల్, దివాకర్‌బబాబు, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పర్యవేక్షణ



వృద్ధుడికి పింఛన్ ఇస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, మే 1: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నగర కమిషనర్ అరుణ బుధవారం పర్యవేక్షించారు. నగరంలోని 33, 34 వార్డు పరిధిలో డోర్ టూ డోర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కమిషనర్ స్వయంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక పరిధిలో మొత్తం 16627 పింఛన్లకు గాను 11587 మందికి నగదు బ్యాంకు ఖాతాల్లోకి జమ అయిందన్నారు. మిగిలిన 5040 మంది లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ములను అందించామన్నారు. 92శాతం పింఛన్ మొత్తాలను పంపిణీ చేశామని, ఏ కారణం చేతనైనా లబ్ధిదారులకు బ్యాంకుల్లో జమకాని వారికి 3వ తేది నేరుగా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు, సీవోలు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించి మొక్కలు నాటారు



చిత్తూరు, మే 1: వ్యర్థాలతో నిండిన ప్రాంతాన్ని శుభ్రం చేసి మొక్కలను నాటారు నగరపాలక అధికారులు. కొంగారెడ్డిపల్లె పూలమార్కెట్ వద్ద వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఈ సమస్యను మార్కెట్‌లో కుప్పలుగా చెత్త అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక కమిషనర్ అరుణ ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది మార్కెట్‌ను పూర్తిగా శుభ్రం చేసి మొక్కలు నాటారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో శానిటరీఇన్స్‌పెక్టర్ నరసింహ, కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గీత కార్మికుల అభివృద్ధి

ఐరాల, మే 1: గీత కార్మికులకు టీడీపీ ఎంతో మేలు చేసిందని ఈడిగ బీసీ సాధికార సమితి అధ్యక్షుడు బుస్సానాగరాజ్‌గౌడ్ అన్నారు. బుధవారం చెంగనపల్లెలో ఆయన మేడే వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు గీత కార్మికులకు ఆదరణ పథకంకింద పనిముట్లు, ద్విచక్రవాహనాలు, సైకిళ్లతోపాటు రూ.10 పదివేలు ఆర్థిక సాయం అందించిందన్నారు. కార్యక్రమంలో మండల ఈడిగౌడ్ సంఘ అధ్యక్షుడు మొగిలప్పగౌడ్, కోళ్లపల్లె సర్పంచ్ శ్రీనివాసులుగౌడ్, నాయకులు రెడ్డెప్పగౌడ్, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



ఎం.ఎస్ బాబును సన్మానిస్తున్న దృశ్యం

పూతలపట్టు, మే1: బడుగు, బలహీనవర్గాల ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అన్నారు. బుధవారం రాత్రి ఆయన మండలంలోని పాలకూరు దళితవాడలో ప్రచారకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకూరు అభివృద్ధికి ఎంతో కృషిచేశానని, వైసీపీ తనకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నదొరై, హరిబాబు, దీన, హరి, రెడ్డెప్ప, శివాజి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెండో విడత ఈవీఎం ర్యాండమైజేషన్ : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మే 1: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ బుధవారం జరిగింది. జేసీ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 226 పోలింగ్ కేంద్రాలు ఉండగా బ్యాలెట్ యూనియన్, కంట్రోల్‌యూనిట్, వీవీ ప్యాట్‌లను ఆరు రౌండ్ల వరకు కంప్యూటరీకరణ ద్వారా ర్యాండమైజేషన్ చేసి పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. మరో 20 శాతం బీయూ, సీయూ, వీవీ ప్యాట్లను రిజర్వులో ఉంచారు. అనంతరం ఈవీఎం గోదాము నుంచి పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూములో భద్రపరిచి వాటికి సీల్ వేశారు.

ఎన్నికల కోఆర్డినేటర్లుగా సీఆర్ రాజన్, చంద్రప్రకాష్

చిత్తూరు సిటీ, మే 1: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు ఎన్నికల కోఆర్డినేటర్లను నియమించారు. అందులో భాగంగా చంద్రగిరి నియోజకవర్గానికి చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఉపాధ్యక్షుడు రామినేని చంద్రప్రకాష్‌లను నియమించారు.

వైభవంగా అర్జున తపస్సు



పాలసముద్రం, మే 1: మండలంలోని అత్తిమంజేరిలో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో బుధవారం అర్జున తపస్సు వైభవంగా నిర్వహించారు. అర్జున పాత్రధారి పద్యాలు పాడుతూ ఒక్కొక్క మెట్టు ఎక్కి నిమ్మపండు, విభూది పండ్లను భక్తులపై చల్లారు. సంతానం లేని మహిళలు నిమ్మపండు కోసం వరపడ్డారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జేసీబీ, టిప్పర్ సీజ్

పాలసముద్రం, మే 1: గంగమాంబపురం పంచాయతీ బలిజ వూరు నుంచి బుధవారంవేకువజామున తమిళనాడుకు చెందిన ప్రవీణ్, పాండ్యరాజన్‌లు డంప్ నుంచి తమిళనాడుకు ఇసుకను తరలిస్తుండగా ఎస్ఐ భారతి తమ సిబ్బందితో జేసీబీ, టిప్పర్‌లను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు వాసులకు ఇసుక విక్రయించిన నరసింహాపురం గ్రామానికి చెందిన సురేష్‌పై కేసు నమోదు చేసి టిప్పర్, జేసీబీలను సీజ్ చేశారు.

వేణుగోపాలస్వామి ఊరేగింపు



కార్వేటినగరం, మే 1: కార్వేటినగరంలోని టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వార్షిక వసంతోత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా జరిగాయి. వసంతోత్సవాల సందర్భంగా స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతి నీరాజనాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

డైట్ లో శిక్షణార్థుల వీడ్కోలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శేఖర్

కార్వేటినగరం, మే 1: కార్వేటినగరం ప్రభుత్వ డైట్ డీఎడ్ రెండవ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ డీఎడ్ రెండవ సంవత్సరం కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు రాబోయే డీఎస్సీ కోసం సన్నద్ధం కావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

ఘనంగా గంగమ్మ నిమజ్జనం



యాదమరి, మే 1: యాదమరిలో బుధవారం గంగమ్మ నిమజ్జన కార్యక్రమం ముగిసింది. మంగళవారం అమ్మవారికి తొలి పూజ నిర్వహించారు. బుధవారం భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఓంశక్తి భక్తులు కొక్కీలు తగిలించుకుని వాహనాలను లాగారు. కొక్కీలపై వేలాడుతూ అమ్మవారికి మాలలు వేశారు. అనంతరం అమ్మవారు ఊరేగింపుగా నిమజ్జనానికి బయలుదేరింది. దారిపొడవునా భక్తులు అమ్మవారికి కర్పూరహారతులిచ్చి మొక్కుకున్నారు.

అడవిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తా

గురజాల జగన్మోహన్



అడవిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న గురజాల జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, మే 1: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అడవిపల్లి ప్రాజెక్టు పనులు పూర్తిచేసి చిత్తూరు ప్రజల దాహార్తిని తీరుస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ స్పష్టంచేశారు. బుధవారం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో కలసి కేవీపల్లి మండలం అడవిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించి పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 'చిత్తూరు నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చడానికి, అలాగే సాగుకు నీరందించేందుకు 2014-19లో అప్పటి సీఎం చంద్రబాబు రూ.250కోట్ల అంచనాతో అడవిపల్లి రిజర్వాయర్ పనులను ప్రారంభించారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయన్నారు. 2024లో ఉమ్మడి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అడవిపల్లి రిజర్వాయర్, హంద్రీ-నీవా పనులను పూర్తి చేసి చిత్తూరు ప్రజలకు, రైతులకు నీటిసమస్య తీర్చుతామని హామీ ఇస్తున్నానని గురజాల జగన్మోహన్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి గురజాల సందీప్, పార్టీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, నేతలు త్యాగరాజన్, రాజశేఖర్, కంద, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, జనసేన పార్టీ నేతలు దయారాం, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్నికల ప్రచారంలో భాగంగా గురజాల ప్రతిమ బుధవారం 10, 20, 29, 39, వ డివిజన్‌లలో ఇంటింటికి వెళ్ళి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 39వ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఆయన తనయుడు సీకే సాయి కృష్ణారెడ్డి, 29వ డివిజన్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, కార్పొరేటర్ అశోక్, శేషాద్రినాయుడు, నరేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మ్యానిఫెస్టోతో అన్ని వర్గాలకు న్యాయం

జీడీ నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్



బెల్లం తయారీలో జయశంకర్‌నాయుడు (ఇన్‌సెట్‌లో) ప్రచార రథంపై భోజనం చేస్తూ ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి థామస్

వెదురుకుప్పం, మే1: టీడీపీ కూటమి మ్యానిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని జీడీ నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ అన్నారు. బుధవారం వెదురుకుప్పం మండలం కొమరగుంట పంచాయతీలో కూటమి పార్టీ శ్రేణులతో కలసి పర్యటించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమను తీసుకొచ్చి యాభై వేల మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. వాటర్ ప్లాంట్ల ద్వారా ప్రజలకు సురక్షిత మంచినీటిని అందిస్తామన్నారు. ఇనాంకొత్తూరు సర్పంచ్ కటారి మమత, ఆమె భర్త కటారి మోహన్‌రెడ్డి తదితరులకు డాక్టర్ థామస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గాలి బాబునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు లోకనాథరెడ్డి పాల్గొన్నారు. ప్రచార కార్యక్రమం సందర్భంగా ప్రచార రథంపైనే కూర్చోని భుజించారు. రథంపై తన కుమారుడు వీఎం రాహుల్‌తో కూర్చోని మధ్యాహ్న భోజనం తిన్నారు. ఈ సందర్భంలో కుమారుడితో కలసి ప్రచార సమాలోచనలు చేస్తూ.. గడిపారు.

బెల్లం తయారీ చేస్తా...సైకిల్‌కి ఓటేయండి

ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు సైకిల్ గుర్తుపై ఓటేయ్యాలని ఎస్ఆర్‌పురం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు అభ్యర్థించారు. ఎగువ కమ్మకండ్రిగ సమీపంలో బెల్లం తయారీ చేస్తుండగా అక్కడికి వెళ్లి రైతులతో మాట కలిపారు. మే 13న సైకిల్ గుర్తుకు ఓటేయాలని, రైతులకు గిట్టుబాటు ధర, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలు కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి ఎంతో అవసరమని వివరించారు.

వైసీపీకి ఓటు వేస్తే భూములు కొట్టేస్తారు

పాలసముద్రం: వైసీపీకి ఓటు వేస్తే ప్రజల భూములను కొట్టేస్తారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు ఆరోపించారు. బుధవారం ఎస్ఆర్ఆర్ కండ్రిగలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను అమలు చేస్తే రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి థామస్, ఎంపీ అభ్యర్థి ప్రసాదరావును గెలిపించాలని కోరారు. నేతలు వాసునాయుడు, శేఖర్ రాజు, బాబు, విజయ్‌కుమార్, వెంకటేశులునాయుడు, అరుణ్‌నాథన్, కృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మ్యానిఫెస్టోతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్



మిట్టూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

ఐరాల, మే 1: టీడీపీ మ్యానిఫెస్టోకి ప్రతి ఒక్కరూ ఆకర్షితులవుతున్నారని పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. బుధవారం ఆయన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ టీడీపీ మ్యానిఫెస్టో ముందు వైసీపీ మ్యానిఫెస్టో ఎందుకు కొరగాకుండా పోయిందన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు గంగారపు హరిబాబునాయుడు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి తులసిప్రసాద్, ఎమ్మెన్ నాయుడు, సోమశేఖర్‌నాయుడు, వెంకటేష్‌నాయుడు, శ్రీధర్‌నాయుడు, జయచంద్రయ్య, అరుణ్‌కుమార్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

వెంగంపల్లెలో టీడీపీలో చేరిన 80 కుటుంబాలు

తవణంపల్లె : మండలంలోని వెంగంపల్లె పంచాయతీ పరిధిలో వైసీపీకి చెందిన 80 కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేస్తూ టీడీపీకి ఓటు వేయాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్‌కుమార్, నాయకులు వెంకటేష్‌చౌదరి, మధుకుమార్, ఐరాల మండల అధ్యక్షుడు గిరిధర్ బాబు, వెంగంపల్లె నాయకులు శరవణ, శ్రీధర్, మురళి, చిట్టెమ్మ, భాస్కర్‌రెడ్డి, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుండి టీడీపీ తీర్థం పుచ్చుకున్న 200 మంది

బంగారుపాళ్యం : బంగారుపాళ్యం దళితవాడకు చెందిన 200 మంది వైసీపీ కార్యకర్తలు, కామాక్షిపురానికి చెందిన 30 కుటుంబాలు మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే సీకే బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీకి ఓటు వేస్తే మీ ఆస్తులు మీవి కావు : గాలి భాను



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మే 1: జగన్ మరోసారి అధికారంలోకి వస్తే మీ ఆస్తులు మీకు దక్కవని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని ఉత్తరపు కండ్రిగ, కనకంపాళెం, గొల్లకండ్రిగ, పరమేశ్వరమంగళం, వేపగుంట, కైలాసపురం, కృష్ణసముద్రం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చిన జగన్ భూ వివాదాల అంశాన్ని న్యాయస్థానం పరిధి నుంచి తప్పించి అధికారులకు కట్టబెట్టే ప్రమాదకర ఆటకు శ్రీకారం చుట్టారని ధ్వజమెత్తారు. మంత్రిగా నగరి నియోజకవర్గానికి ఏమి వెలగబెట్టారని ప్రజలను రోజా ఓట్లు అడుగుతోందని ప్రశ్నించారు. ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు, తనకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. మాజీ ఎంపీపీలు గంజి మాదవయ్య, డీఎన్ ఏలుమలై మొదలియార్, రూరల్ పార్టీ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అల్లుడి కోసం మామ ప్రచారం

విజయపురం : నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ గెలుపు కోసం మామ బాలకృష్ణమనాయుడు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని కేవీశ్రీరామాపురం, కేవీపురం గ్రామాల్లో పర్యటించి భానుప్రకాష్‌ను ఆదరించాలని కోరారు. టీడీపీ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, జయమూర్తి నాయుడు, శంకరప్పనాయుడు, మురళీనాయుడు, బాబునాయుడు, మధునాయుడు, జీవరత్నం పాల్గొన్నారు.

అక్కడ ఉచితం... ఇక్కడ బాదుడు

మరమగ్గాలకు తమిళనాడులో 500 యూనిట్లు ఉచితం ● ఆంధ్రాలో యూనిట్‌కు 3.75



నగరి మే1: ఆంధ్రా నుంచి అడుగు అటు వేస్తే తమిళనాడులో మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వడమేగాక 500 యూనిట్లకు పైబడితే ఒక యూనిట్‌కు కేవలం రూ2.20 మాత్రం బిల్లు వేస్తున్నారు. అదే ఆంధ్రాలో తీసుకున్నట్లయితే ఉచిత విద్యుత్ లేకపోగా యూనిట్‌కు రూ3.75 బిల్లు వేస్తున్నారు. నగరి నియోజకవర్గంలో గతంలో మరమగ్గాలు అధికంగా వుండటమే గాక దేశ విదేశాలలో నగరి నేతన్న నేసిన బట్టలకు భలే గిరాకీ వుండేది. నేడు వైసీపీ అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ ఛార్జీలపేరుతో విద్యుత్ బిల్లులు ఇష్టానుసారం పెంచడమే గాక మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో మరమగ్గాలను పలువురు మూసివేసి రోజువారీ కూలీలుగా తమిళనాడుకు వెళుతున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే 500 యూనిట్లు మరమగ్గాలకు ఉచిత విద్యుత్ సైకర్యం కల్పిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు.

కష్టాల కొలిమిలో నేతన్నల జీవితాలు



వైసీపీ అధికారంలోకి వచ్చాక మరమగ్గ కార్మికుల జీవితాలు కష్టాలకొలిమిలో కూరుకుపోయాయి. ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ ఛార్జీలు ఇష్టానుసారం పెంచేశారు. నేతన్నలు నేచిన బట్టలకు మార్కెటింగ్ లేక మరమగ్గ కార్మిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది.

- పెరుమాళ్, మరమగ్గ కార్మికుల జిల్లా అధ్యక్షుడు

సూపర్ సిక్స్‌తో కూటమి సిక్స్ కొట్టడం ఖాయం

చిత్తూరు రూరల్, మే1: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలకు ప్రజలు ఆకర్షితులు అవుతున్నా రని, రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయమని టీడీపీ జిల్లా సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్ అన్నారు. బుధవారం చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు, చింతల గుంట పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇసుక రీచ్‌లు ఉండి కూడా రూ.3500 నుంచి రూ.5 వేలు వరకు పెట్టి ట్రాక్టర్ ఇసుక కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు, టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, రాజా, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు : టీడీడీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి లోకనాథనాయుడు నాయకులతో కలిసి సన్యాసిపల్లి, శాతంబాకం పంచాయతీలలో ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ప్రతి ఇంటికి వెళ్లి సైకిల్‌కి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో హరిబాబునాయుడు, కార్జాల అరుణ, తలారి రెడ్డెప్ప, కృష్ణమూర్తినాయుడు, బాస్కర్, అశోక్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు : మండలంలోని తిరువీధికుప్పం, అంటోధరపల్లె, పాతపాళ్యం పంచాయతీల్లో టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు నిధి ప్రచారం నిర్వహించారు. డాక్టర్ థామస్, దగ్గుమళ్ల ప్రసాదరావులను గెలిపించాలని కోరారు.